www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 9 డిసెంబర్ 2022
5
తిరుపతి



నేడు అంతర్జాతీయ గణిత సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ సొసైటీ ఫర్ మ్యాథమెటికల్ సైన్స్ ఆధ్వర్యంలో 31వ సంవత్సరపు కాంగ్రెస్ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు కార్యనిర్వాహకులు ఆచార్య ఏ.చందూలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీటీడీ ఈవో ధర్మారెడ్డి, వర్సిటీ ఉపకులపతి ఆచార్య జిఎస్ఆర్ కృష్ణమూర్తి, కుల సజీవులు చల్లా వెంకటేశ్వర్, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ సొసైటీ ఫర్ మ్యాథమెటికల్ సైన్స్ జనరల్ సెక్రటరీ ఆచార్య సి. జయ సుబ్బారెడ్డి, ప్రెసిడెంట్ ఆచార్య ఎన్ కిషన్ తదితరులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ అంతర్జాతీయ సదస్సులో ఇతర దేశాల నుంచి, రాష్ట్రాల నుంచి దాదాపుగా 200 మంది పరిశోధకులు అధ్యాపకులు పాల్గొంటారని వెల్లడించారు..

భక్తులకు నిర్విఘ్నంగా అన్నప్రసాదం : టీటీడీ ఈవో

ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు నిర్విఘ్నంగా అన్నప్రసాద వితరణ జరగాలని శ్రీవేంకటేశ్వర స్వామివారిని ప్రార్థిస్తూ అన్నప్రసాద భవనంలో ఆయుధపూజ నిర్వహించినట్టు టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలోని మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో గురువారం ఉదయం జరిగిన ఆయుధపూజలో ఈవో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ నిత్యం వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతున్న క్రమంలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని భగవంతుని ప్రార్థిస్తూ ప్రతి సంవత్సరం అన్నప్రసాద భవనంలో సాంప్రదాయబద్ధంగా ఆయుధపూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. దాతల సహకారంతో భక్తులకు నిరంతరం అన్నప్రసాదాలు అందిస్తూ, ప్రపంచంలోనే మొదటిస్థానంలో నిలుస్తోందని చెప్పారు. రూమలలో 1983వ సంవత్సరం ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం 2009లో మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం నిర్మించి రోజుకు దాదాపు 14గంటల పాటు నిరంతరాయంగా భక్తులకు అత్యద్భుతమైన అన్నప్రసాదాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి రుచికరమైన భోజనాలు అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అన్నప్రసాదాల తయారీకి వినియోగించే సామగ్రికి, యంత్రాలకు పూజలు చేసినట్టు వివరించారు. అంతకుముందు అన్నప్రసాద భవనంలో శ్రీవారి చిత్రపటానికి, వంట పాత్రలకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అన్నప్రసాదం డెప్యూటీ ఈవో సెల్వం, ప్రత్యేక అధికారి జిఎల్ఎన్ శాస్త్రి, హెల్త్ ఆఫీసర్ శ్రీదేవి, విజిఓ ఇతర అధికారులు, అన్నప్రసాద విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటు అత్యవసరం

తిరుపతి వేదికగా రాష్ట్ర మున్సిపల్ టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అసోసియేషన్ తొలి సమావేశంలో సభ్యులు

టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అసోసియేషన్ నేతలు మాట్లాడుతున్న దృశ్యం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగంలో ప్రత్యేకంగా ఎన్ఫోర్స్మెంట్ విభాగం ఏర్పాటు అత్యవసరమని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అసోసియేషన్ అభిప్రాయం వ్యక్తం చేసింది. రోజువారీ విధులు నిర్వర్తిస్తూ అక్రమ నిర్మాణాల నియంత్రణ కష్టతరమవుతోందని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు అసోసియేషన్ తీర్మానించింది. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ టెక్నికల్ అసోసియేషన్ ఏర్పాటు అనంతరం గురువారం తిరుపతి వేదికగా తొలి సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.మోహన్‌బాబు, కోశాధికారి వి.కష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కే.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రణాళిక విభాగంలో ఖాళీలను భర్తీ చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 450 బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వార్డు ప్లానింగ్ సిబ్బంది నియామకం చేపట్టారని గుర్తుచేశారు. పట్టణ ప్రణాళికవిభాగం బలోపేతానికి అర్హత కలిగిన వార్డు ప్లానింగ్ సిబ్బందికి బిల్డింగ్ ఇన్ స్పెక్టర్లుగా పదోన్నతులు కల్పిస్తే బాగుంటుందని అన్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వానికి అసోసియేషన్ తరపున నివేదించనున్నట్లు వెల్లడించారు. అలాగే నామినేషన్ పద్ధతిన అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా హరిదాస్, మురళి గౌడ్‌లను ఎన్నుకున్నారు. 2023 డైరీకి సంబంధించి ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ నియామకం చేపట్టారు. అనంతరం పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమా వేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు అబ్దుల్‌సత్తార్, కె.శ్రీనివాసులు, మురళీగౌడ్, ఇతర జిల్లాల జోనల్ అధ్యక్షులు, పట్టణ ప్రణాళికవిభాగం అధికారులు మురళి, మునిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి14 వరకు
ఏపీపీఎస్‌సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు : డీఆర్ఓ



ఏపిపిఎస్‌సి డిపార్ట్‌మెంటు పరీక్షల సమీక్ష

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు ఏపిపిఎస్‌సి డిపార్ట్మెంట్ పరీక్షలు జరగనున్నాయని ఏర్పాట్లను పగడ్బందీగా చేపట్టాలని జిల్లా రెవెన్యూఅధికారి శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో డిఆర్ఓ ఛాంబర్‌లో ఏపిపిఎస్‌సి డిపార్ట్మెంట్ పరీక్షల నిర్వహణ పై లైజన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. డిఆర్ఓ మాట్లాడుతూ ఇయాన్ డిజిటల్ జూపార్క్, శ్రీవెంకటేశ్వర పెరుమాళ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ పుత్తూరు, కెఎంఎం ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ రామిరెడ్డిపల్లి, అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ తిరుపతి, నాలుగు కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుండి 11గంట వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు రెండవ సెషన్ జరగనున్నదని తెలిపారు. పరీక్ష సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, ఆర్‌టిసి పరీక్షా కేంద్రాలకు బస్సుల ఏర్పాటు, పోలీస్ బందోబస్తు పగడ్బందీగా నిర్వహించి చిన్నపాటి పొరపాటు కూడా లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో లైజన్ అధికారులు డిటిలు గంగయ్య, భార్గవి, వెంకటేషన్ యుగంధర్ బాబు, స్పెషల్ బ్రాంచ్ చంద్రశేఖర్, ఆర్‌టిసి డిఆర్.నాయుడు ఏపిఎస్‌పిడిసిఎల్ గణపతి పాల్గొన్నారు.

టిడిఆర్ బాండ్లు త్వరగా అందించండి : మేయర్

మాస్టర్ ప్లాన్ రోడ్ల విస్తరణ పై మాట్లాడుతున్న మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్, డిప్యూటీ మేయర్లు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరాభివద్ధికి చేపట్టిన మాస్టర్‌ప్లాన్ రోడ్ల పనుల్లో పురోగతి ఉండేలా అధికారులు కషి చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ప్లానింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశంలో మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. జూమ్ మీటింగ్ ద్వారా డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పాల్గొని చర్చించడం జరిగింది. ఈసందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ రహదారుల అభివద్ధితోనే నగరం మరింత అభివద్ధి సాధిస్తుందనే ప్రణాళికతో కౌన్సిల్ ఆమోదంతో చేపట్టిన మాస్టర్‌ప్లాన్ రోడ్లను సకాలంలో పూర్తిచేసేందుకు ప్రజలతో కలిసి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇప్పటికే పూర్తిచేసిన వైఎస్ఆర్ మార్గం, అన్నమయ్య మార్గం గురించి వారు వివరిస్తూ ప్రజలకి ఎంతో ఉపయోగకరంగా ఈరోడ్లు అందుబాటులోకి రావడం జరిగిందన్నారు. అదేవిధంగా మిగిలిన మాస్టర్‌ప్లాన్ రోడ్లను పూర్తి చేయడం వలన ప్రజలు ట్రాఫిక్‌కష్టాల నుంచి బయటపడటమే కాకుండా రోడ్లవిస్తరణతో నగరం శరవేగంగా అభివద్ధి సారిస్తుందన్నారు. తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ముందరన్న గాంధీ విగ్రహం ప్రక్క నుంచి గంగమ్మగుడి వైపుగా వెలుతున్న రోడ్డును ఏరియా అభివద్ధిలో భాగంగా వెడల్పు చేసే ప్రక్రియను త్వరితంగా పూర్తి చేసేందుకు ప్లానింగ్ సిబ్బంది మార్కింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి సమా వేశంలోని అధికారులతో మాట్లాడుతూ రోడ్ల వెడల్పుకు తమ స్థలాలను ఇస్తున్న యజమానులకు మునిసిపల్ కార్పొరేషన్ తరుపున టిడిఆర్ బాండ్లను త్వరితగతిన అందించేలా చూడాలన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల ఆవశ్యకతను ప్రజలకి మరింతగా వివరించాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ అభిప్రాయం వెలిబుచ్చారు. సమావేశంలో మునిసిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ సిటీప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి, అసిస్టెంట్ సిటీప్లానర్లు బాల సుబ్రమణ్యం, షణ్ముగం, మాస్టర్‌ప్లాన్ రోడ్ల ప్లానింగ్ సెక్రటరీలు, కార్పొరేటర్లు అనీల్ కుమార్, ఆంజినేయులు, వైసిపి నాయకులు దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, వంశీ, చింతలచేను గోపి తదితరులు పాల్గొన్నారు.

కడప అమీన్ పీర్ దర్గాని సందర్శించిన తిరుపతి ఎంపీ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: కడప, అమీన్ పీర్ పెద్దదర్గాలో వెలసిన హజరత్ సూఫీ సరమస్త్‌సాని చల్లాకష్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా మొహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిస్టివుల్ ఖాద్రి ఉరుసు ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తిరుపతి ఎంపీ గురుమూర్తి అమీన్ పీర్ దర్గాని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ కార్యక్రమాలను దగ్గరుండి వారి సాంప్రదాయం ప్రకారం దర్గా ప్రాసస్త్యం గూర్చి వివరించి ప్రార్థనలు జరిపారు. అనంతరం ప్రత్యేక తీర్థాన్ని అందించారు.

మేడ్ ఫర్ భారత్ ఈ- కామర్స్ ఆవిష్కరణలను
తమిళ, తెలుగు భాషలోనూ..

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: భారత్ అత్యంత వేగంగా వద్ధి చెందుతున్న హైపర్ వాల్యూ ఈ- కామర్స్ ప్లాట్‌ఫామ్, షాప్సీ బై ఫ్లిప్‌కార్ట్ ఇప్పుడు తమ పరిధిని విస్తరించడానికి వివిధ ప్రాంతాలలో ఎక్కువమంది వినియోగదారులకు సేవలనందించడానికి తమిళ, తెలుగు భాషలలో పరిచయం చేసినట్లు ఫ్లిప్‌కార్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అండ్ హెడ్ న్యూబిజినెస్ ఆదర్శ్ మీనన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులు తమ ప్రాధాన్యతా భాషను ఎంచుకునే అవకాశం కల్పించడంతో పాటు విస్తత శ్రేణిలోని అందుబాటు ధరల ఉత్పత్తులను తమ ఫ్లాట్‌ఫామ్‌పై అతి సులభంగా పొందే అవకాశమూ అందిస్తుంది. షాప్సీ వద్ద అధ్యయనాలు వెల్లడించేదాని ప్రకారం, మెట్రోయేతర నగరాలలో నివాసముంటున్న వినియోగదారులు ఆంగ్లభాష పరిజ్ఞానం కలిగి ఉన్నప్పటికీ తమ మాతభాషలో మరింత సౌకర్యం అనుభవిస్తున్నారు. ఉత్పత్తులను కనుగొనడం, ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయడం పరంగా అది వారికి మరింత సౌకర్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు

ఎస్‌వి ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు ప్రీ రిపబ్లిక్ శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించబడే శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన పలు శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించుకొని కళాశాలకు చేరుకున్నారు. ఆ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ టి.నారాయణమ్మ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా, ఎన్‌సిసి క్యాడేట్లుగా పలు రకాల శిక్షణ కార్యక్రమాల్లో దేశవ్యాప్తంగా నిర్వహించిన అడ్వెంచర్ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అటువంటి అవకాశం శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు దక్కటం నిజంగా కళాశాల అధ్యాపకుల కృషిని కొనియాడారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ఎం.రంగస్వామి నాయక్ హిమాచల్ ప్రదేశ్‌లోని కులుమనాలిలో పది రోజులు జాతీయ అడ్వెంచర్ కార్యక్రమంలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసాడని వెల్లడించారు. అలాగే గుజరాత్ రాష్టంలో పి.తరుణ్ ప్రీ రిపబ్లక్ శిక్షణ పూర్తి చేశారని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ టీ.నారాయణమ్మ ఎన్ఎస్ఎస్ అధికారులు సుబ్రహ్మణ్యం నాయుడు, జయరామయ్య, అధ్యాపకులు డాక్టర్ భీమన్న, డాక్టర్ ప్రసాద రావు, కిరణ్ కుమార్ రాజు, మోహన్ మూర్తి అభినందనలు తెలిపారు.

ప్రతిరోజు దినపత్రికలు చదవాలి

జాతీయ పోటీ పరీక్షల్లో అభ్యర్థులు ఎలా సిద్ధం కావాలో వివరిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ చక్రపాణి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: వసతిగహాల్లో చదువుతున్న విద్యార్థులు జాతీయస్థాయిలో జరుగు సివిల్స్ పోటీపరీక్షలలో విజేతలుగా ఎదగాలంటే ప్రతిరోజు తెలుగు, ఆంగ్ల దినపత్రికలు సుమారు రెండు గంటలపాటు చదవడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి సులభతరమని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ డి.చక్రపాణి ఐఏఎస్ రిటైర్డ్ (హైదరాబాదు) గురువారం ఉదయం 11గంటలకు స్థానిక బాబు జగజ్జీవన్ రామ్ భవన్‌లో ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ పి.అంజయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో పాల్గొని విద్యార్థులకు చైతన్యం కలిగించారు. మరోప్రముఖ అతిథి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, న్యాయమూర్తి జస్టిస్ పిఎస్.నారాయణ పాల్గొని మాట్లాడుతూ అనేక కష్టాలకు ఓర్చి యూనివర్సిటీ స్థాయి వరకు పేదవిద్యార్థులు రావడం చాలా సంతోషకరం అన్నారు. అంతేకాకుండా తాత్కాలిక ప్రయోజనాల కంటే దీర్ఘకాలిక మార్పు కోసం ఏకాగ్రతతో చదవగలిగితే కార్పొరేట్ కాలేజీలలో చదివే విద్యార్థులకు దీటుగా ఉన్నతస్థాయికి ఎదగడానికి అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. సాంఘిక సంక్షేమశాఖ తిరుపతి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య మాట్లా డుతూ తల్లిదండ్రుల సహ కారంతో వసతి గహాల్లో చదువుతున్న మీరు ఈస్థాయికి రావడానికి ప్రధాన కారణం వారి ఆశీ స్సులు, అధికారుల సహాయ సహకారాలు తీసుకొని సమాజంలో మేము ఎవరికీ తక్కువ కాదు అన్నట్లు చదవ వలసిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వసతి గహాల వార్డెన్స్ కె.ప్రసూన, మునిశేఖర్, రాధా, అనిలా, ప్రిన్సిపాల్ రత్నప్రభతో పాటు ప్రజా సంఘాల నాయకులు పి.అమర్నాథ్, దొరస్వామి రెడ్డప్ప తదితరులు పాల్గొని ప్రసంగించారు.

తప్పిపోయిన బాలల ఆచూకీ లభ్యం

ఊపిరి పీల్చుకున్న పోలీసులు తల్లిదండ్రులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని రణధీరపురం గ్రామపంచాయతీ (బిటిఆర్ కాలనీ)లో నివాసం ఉన్న నలుగురు బాలలు నాని, లోకేష్, వెంకటేష్, మోహిత్ బుధవారం నుండి కనబడుటలేదని విద్యార్థుల తల్లిదండ్రులు అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై అలిపిరి ఎస్ఐ ఇమ్రాన్ భాష మిస్సింగ్ కేసును నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పిల్లల మిస్సింగ్ సమాచారాన్ని సోషల్ మీడియా ద్వారా వాట్సాప్ గ్రూపులో విస్తృతంగా ప్రచారం అయ్యేలా పోలీసులు చర్యలు చేపట్టారు. మరోవైపు మంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదుతువుతున్న వీరి హాజరు, నడవడికపై పోలీసులు సమాచారాన్ని సేకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలు కనబడలేదని కన్నీరు పెట్టుకొంటూ గుబులు చెందుతున్న నేపథ్యంలో గురువారం సాయంత్రం తిరుమల కాలినడక మార్గంలో తప్పిపోయిన బాలలు ఉన్నట్లు అలిపిరి ఎస్ఐ ఇమ్రాన్ బాషాకు సమాచారం అందింది. వెంటనే వారిని అలిపిరి పోలీస్ స్టేషన్‌కు తరలించి వారి తల్లి దండ్రులకు అప్ప గించారు. దీంతో ఇటు పోలీసు అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రీ రిపబ్లిక్ డే పెరేడ్‌కు మహిళా వర్సిటీ విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - క్యాంపస్ : దేశంలో జాతీయ స్థాయిలో జనవరి 26వ తేదీన నిర్వహించే పేరెడ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తరపున ఎన్ఎస్ఎస్ విద్యార్థిని ఎంపికైందని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య కాత్యాయని వెల్లడించారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం న్యాయవిభాగం నుంచి శ్రీమహాలక్ష్మి ప్రీ రిపబ్లిక్ డే పేరెడ్‌కు ఎంపికయ్యారు. గుజరాత్‌లోని ఆనందులో వెస్ట్‌జోన్ సెలక్షన్స్‌లో పాల్గొన్న శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, విద్యార్థులు సుంకర శ్రీమహాలక్ష్మి ఎంపికయ్యారు. ఎంతో శ్రమతో కూడిన శిక్షణ, ఎంపిక విధానంలో పాల్గొన్నారు. జిల్లా వల్లభ విద్యానగర్ సర్దార్ పటేల్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే క్యాంపులో పాల్గొ న్నారు. ఈ సందర్భాన్ని పురస్క రించుకొని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున, రిజిస్ట్రర్ డిఎం మమత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కాత్యాయని, యూనిట్ వన్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత, సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య కే అనురాధ, హెచ్ఓడి డాక్టర్ మాధురి పరదేశి లు సాలువాతో సత్కరించారు. ఇలాంటి పురస్కారాన్ని మరిన్ని అందుకోవాలని యువతకు ఆదర్శంగా ఉండాలని తెలిపారు.

జగన్ వెంటనే బీసీలు ఉంటారు

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారిని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ దర్శించుకున్నారు. గురువారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శనసమయంలో ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో ఇప్పటి వరకు 136 కులాలను పరిశీలించి 56 కార్పొరేషన్ చేశరాని, లక్ష 71వేల కోట్ల బడ్జెటు రూపాయలను బిసిలకు అందిజేస్తున్నారన్నారు. ఈరోజు జగన్ వెనుక ఉంటే బిసిలకు అన్యాయం జరగదని ఒక నమ్మకం ఉందని ఆయన తెలిపారు.

శ్రీవారి సేవలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రస్తుతం తాను రాజకీయాలకు దూరంగా ఉన్నానని, ఒక ఎంపిగా రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి పార్లమెంటులో తానే ఎక్కువ నిధులు తెచ్చుకున్నానని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు మంచి పరిపాలన అందించేందుకు ఎన్నికలు ఇంకా రెండున్నర సంవత్సరం ఉంది కాబట్టి నెల ముందు వివరిస్తానన్నారు. తెలంగాణలో వైఎస్ షర్మిలపై జరిగిన ఘటన ఆయన స్పందించారు. ఆమెకు పోలీసులు నచ్చచెప్పి తీసుకుని వెళ్లి ఉంటే బాగున్ను అన్నారు. ప్రపంచాన్ని పట్టి పీడించిన కరోనా లాంటి మహమ్మరి రాకుండా చూడాలని స్వామివారిని ప్రార్థించానని ఆయన తెలిపారు.

దారి కల్పించాలని రైల్వే అధికారులకు వినతి

రైల్వే అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న మంత్రి ఆర్కే రోజా..

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: గేటు పుత్తూరు ప్రజలకు చుట్టుపక్కల గ్రామాల వాసులకు గేటు దారి ఏర్పాటు చేయాలని మంత్రి ఆర్కే రోజా పుత్తూరు రైల్వే డివిజనల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో ఉన్న గేటు రైల్వే పట్టాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం పుత్తూరు పట్టణానికి పక్కనే గల గేటు పుత్తూరు పట్టణంలోని ద్రౌపదమ్మ గుడి ఎదురుగా ఉన్న దారిని రైల్వే అధికారులు మూసి వేయడం వలన గేట్ పుత్తూరు ప్రజలకు ఇబ్బందిగా ఉందన్నారు. గేటు పుత్తూరు వాసులు పుత్తూరు పట్టణానికి వెళ్లేందుకు రైల్వే లైన్‌దాటడానికి అనుమతివ్వాలని, మార్గం రెడీ చేసి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్ ఛైర్మన్లు బి.శంకర్ డి.జయ ప్రకాష్, కౌన్సిలర్లు, గేటు పుత్తూరు ప్రజలు, వైసిపి కార్యకర్తలు, నాయకులు కలిసి పాల్గొన్నారు.

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు..

గురుకుల విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి -దొరవారిసత్రం: మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు రెజ్లింగ్ పోటీలకు జాతీయస్థాయిలో ఎంపికైనట్లుగా గురువారం ప్రిన్సిపాల్ తిరుపతయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ అండర్ -19 విభాగంలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో సీతారాం గోల్డ్ మెడల్ లీలా మోహన్ సిల్వర్ మెడల్ మణిదీప్ సిల్వర్ మెడల్ సాధించారు. అయితే గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థి సీతారాం ఈ నెల 25తేదీన ఢిల్లీలో జరగబోవు పోటీలో పాల్గొనడం జరుగుతుందని ప్రిన్సిపాల్ తిరుపతయ్య తెలియజేశారు. జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపికైనందుకు జోనల్ అధికారి అంకారావు ప్రిన్సిపాల్ తిరుపతయ్య పీడీ చంద్రశేఖర్, పీఈటి సుప్రజ, కళాశాల, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

అందుబాటులో టాయిలెట్ క్లీనర్లు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్ : మండల కేంద్రంలోని స్థానిక మండల విద్యా వనరుల కేంద్రానికి గురువారం పాఠశాలలకు అవసరమైన టాయిలెట్ క్లీనర్స్ వచ్చి చేరాయని మండల విద్యా వనరుల శాఖ అధికారిని ఆర్.భువనేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉన్న అర్బన్, రూరల్‌కు సంబంధించి ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మొత్తం 143 ఉన్నాయని తెలిపారు. ఈ పాఠశాలలకు సంబంధించి 575 పెట్టెల టాయిలెట్ క్లీనర్స్ అందుబాటులో ఉన్నాయని ఒక్కొక్క పెట్టెలో ఐదు లీటర్ల క్యాన్లు రెండు ఉంటాయని తెలిపారు. శుక్రవారం నుంచి పాఠశాల వారీగా అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా వనరుల కేంద్ర సిబ్బంది ప్రశాంత్, లలిత తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రస్తుతం రాష్ట్రంలో జర్నలిస్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలంటూ జర్నలిస్ట్ కార్మికుల నాయకుడు తాలేటి రామచంద్రయ్య ఆంధ్ర రాష్ట్ర ప్రెస్ క్లబ్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. గురువారం జర్నలిస్టులకు మానసిక ఒత్తిళ్ళ పరిష్కార మార్గాల అవగాహన సదస్సును విజయవాడలోని గాంధీ నగర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతులు, కరోనాలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ కష్టాలు, అందాల్సిన సాయంపై రామచంద్ర మాట్లాడారు. ప్రతి జర్నలిస్టుకు గుర్తింపు ఉండేలా యాజమాన్యాలకు ప్రభుత్వంకు సిఫారసు చేయాలన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు జివిడి కృష్ణమోహన్, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్, ఆంజనేయులు, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు రూ.5 లక్షలివ్వాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జగన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీలో ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణానికి రూ.8 నుంచి రూ.10 లక్షలు ఖర్చవుతుంటే ప్రభుత్వం రూ.1.80 లక్షలు మాత్రమే ఇస్తే ఎలా సరిపోతుందన్నారు. ఆ సాయంతో పునాది మాత్రమే వేసుకోగలుగుతారని ఆవేదన వ్యక్తం చేశారు. సిమెంటు, కమ్మి, ఇసుక, ఇటుక ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా ప్రభుత్వం లబ్ధిదారులకు డబ్బులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్దిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. జనమాల గురవయ్య, గోపి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించండి : తెలుగు యువత

మాట్లాడుతున్న తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి

ప్రజాశక్తి-వెంకటగిరి: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కెవికె ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో 575 మంది యువకులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ప్రభుత్వం సరైన భరోసా కల్పించకపోవడంతో ఈ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. దేశంలో ఇటీవల పట్టుబడిన గంజాయిలో ఎక్కువ శాతం ఆంధ్ర ప్రదేశ్‌లోనే స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ఒకప్పుడు అన్నపూర్ణ పిలిచేవారన్నారు. ప్రస్తుతం గంజాయి ప్రదేశ్‌గా మార్చివేశారని ఆరోపించారు. వైఎస్‌పి ముఖ్యనాయకులే ఈగంజాయి సాగు చేస్తున్నారని ఆరోపించారు. తెలుగు యువత నాయకులు సుబ్బు యాదవ్, మురళీ, చెంచయ్య పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పట్టించుకోని వైసీపీ సర్కార్

ఇదేం ఖర్మ కార్యక్రమంలో గాలిభానుప్రకాష్

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే, వైసీపీ సర్కార్ పట్టించుకోవడం లేదని, ఇదేం ఖర్మ మనకి అని నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. గురువారం పుత్తూరు మున్సిపాలిటీ 7వ వార్డులో వైసీపీ పాలనలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొని కరపత్రాలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు గాలి జీవరత్నం నాయుడు, ఎన్ ఎన్ దనపాల్, డిఎస్ గణేష్, కరుణాకరన్, డిజి ధనపాల్, సోము, ఇళయరాజా, మోహన, అన్బు, మహమ్మద్ రఫీ, యం.ఈశ్వర్ యాదవ్, హమీద్ భాషా, రాజేంద్ర, శీన, దినేష్, సూర్య, తురబ్, నవీన్ పాల్గొన్నారు.

'మాండూస్' తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కోట : మండలంలోని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని మండల ప్రత్యేక అధికారి వి. వెంకటేశర్లు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆయన అధికారులతో మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్ తుఫాను హెచ్చరికలు నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకునేవిధంగా అధికారులుకు అవగాహన కల్పించామన్నారు. రాబోవు మూడు రోజుల పాటు ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విపత్తుల సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి, విద్యుత్ శాఖ ఏ. ఇ.ఇస్మాయిల్, నీటిపారుదల శాఖ ఏఈ ఫరూక్, ఎమ్ ఈ ఓ ఎమ్.వెంకట సునీల్ కుమార్, విఓపి ఆర్డీ స్వరూపరాణి, ఎన్ఆర్ఈజిఎస్ ఏపీఓ విజయలక్ష్మి, వివిధ శాఖల మండల అధికారులు ఉన్నారు.

మండల ప్రత్యేక అధికారి వి.వెంకటేశ్వర్లు

బిఎన్‌కండ్రిగ: నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండంగా మారిన అల్పపీడనం కారణంగా గ్రామాల్లోని ప్రజలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని బిఎన్‌కండ్రిగ తహశీల్దార్ చంద్రశేఖర్ నాయుడు, ఎంపిడిఓ త్రివిక్రమ రావులు అధికారులకు తెలియజేశారు. గురువారం బిఎన్‌కండ్రిగ ఎంపిడిఒ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వాతావరణంపై పలు సూచనలు, సలహాలును అందజేశారు.

కెవిబిపురం: మండలంలోని నివాసం ఉంటున్న ప్రజలందరూ తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలని గురువారం తహశీల్దార్ ద్వారకానాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఈనెల 11 వరకు తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మండల పరిధిలో పనిచేస్తున్న వీఆర్వోలు అందరూ తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం : ఆర్డీఓ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో గూడూరు డివిజన్ పరిధిలో ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని గూడూరు ఆర్డిఓ కిరణ్ కుమార్ తెలిపారు. తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వచ్చి ఉన్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ టీం సభ్యులను గూడూరు ఆర్డిఓ కిరణ్ కుమార్ కలిసి చర్చించారు. ఈ క్రమంలో విద్యార్థులకు జాతీయ, రాష్ట్ర విపత్తుల పట్ల అవగాహన కల్పిం చేందుకు ఎస్‌డి ఆర్ఎఫ్ బృందాల సభ్యులు అవగాహన కల్పించారు.

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:న పట్టణంలోని పురపాలక సంఘంలో పలు అభివృద్ధి పనులకు ఒక కోటి 15 లక్షలు పనులకు మంత్రి ఆర్.కె.రోజా చేతులు మీదుగా గురువారం ప్రారంభోత్సవాలు చేశారు. పుత్తూరు పట్టణంలో ఎస్.ఆర్.ఎస్ డిగ్రీ కళాశాల సమీపంలో - 14వ ఆర్థిసంఘం నిధులతో అంచనా విలువ రూ.50 లక్షలతో వాసవి నగర్, సాయి నగర్, వీరపారెడ్డి పాలెంలో నిర్మించిన సిమెంట్ రోడ్డను ప్రారంభించారు. పుత్తూరు మునిసిపాలిటీ పిళ్ళారి పట్టు రోడ్డులో 14వ ఆర్థికసంఘం నిధులు అంచనా ఖర్చు రూ. 25 లక్షలతో పిళ్ళారి పట్టు లో సిమెంటు రోడ్డు, గాంధి నగర్‌లో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. పుత్తూరు మునిసిపాలిటీ కార్యాలయంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.37 లక్షలతో కొనుగోలు చేసిన జేసిబిని ప్రారంభించారు. పురపాలక సంఘం సాధారణ నిధులతో ఆధునికరించిన బస్సుషెల్టర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్, ఏ.హరి, వైస్ ఛైర్మన్‌లు డి.శంకర్, డి.జయప్రకాష్, కౌన్సిలర్లు, బాలసుబ్రమణ్యం, నరసింహారావు, ఎడి పవన్ కుమార్, మునిసిపాల్ కమిషనర్, కేఎల్ఎంఎన్ రెడ్డి, అధికారులు, ఆలయ కమిటీ చైర్మన్ లు, ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు

ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతిస్తున్న గ్రామ ప్రజలు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని యార్లపూడి పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యార్లపూడి, యార్లపూడి ఎస్సీ కాలనీ, బీ.సీ కాలనీ, రేపల్లి, బత్తలపల్లి, రాజు గుంట గ్రామల్లో పర్యటించి ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎవరికైనా ఏమైనా సమస్యలు ఉంటే తెలపాలని గ్రామ ప్రజలను కోరారు. ప్రస్తుతం పరిష్కారం కానీ సమస్యలను 14వ తేదీ శ్రీకాళహస్తి పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో జరిగే ప్రజా దర్బార్ కార్యక్రమంలో పరిష్కరిస్తామని గ్రామ ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.పీ.డీ.ఓ ప్రేమ్ రాజ్ కుమార్, మండల తహశీల్దార్ జరీనా బేగం, ఈ.ఓ.పి.ఆర్డీ సురేంద్రనాథ్, శ్రీకాళహస్తి రూరల్ హౌసింగ్ ఏ.ఈ అలీ, ఎంపీటీసీ వెంకటరత్నమ్మ, యార్లపూడి గ్రామ సచివాలయ డి.డి.ఓ శ్రీవాణి, వైసీపీ నాయకులు రాఘవరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చారు

డిఆర్ఐ నివేదికలో ఏపీనే టాప్ : రవినాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి రవాణా, వినియోగంతో యువత పెడదారిన పడు తోందన్నారు. ఉద్యోగాలు చేసుకోవలసిన నిరు ద్యోగులు గంజాయి రవాణాకు వెళ్లేలా ప్రభుత్వం పరిస్థితులను కల్పించిందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని గద్దెనెక్కిన జగన్మోహన్ రెడ్డి సర్కార్ నేడు ఆ హామీని మరచి గంజాయిని రవాణా చేసే రాష్ట్రంగా పేరు తెచ్చుకుందన్నారు. డిఆర్ఐ నివేదికలను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ విడుదల చేశారని, అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మత్తు పదార్థాల రవాణాలో ముందంజలో ఉందన్నారు. ఇటీవల 18వేల కేజీల గంజాయి పట్టుబడటం ఇందుకు నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో మత్తు పదార్థాల రవాణా, వినియోగం అరికట్టడానికి తెలుగు యువత శంఖారావం పూరించిందన్నారు. 10వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో వినూత్న నిరసనలు నిర్వహించి సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో గంజాయి నిర్మూలన కోసం అధికారులకు వినతులు ఇస్తామన్నారు. గంజాయి సాగు వెనుక అధికార పార్టీ నాయకుల హస్తం ఉందని, పోలీసు విచారణలు చేసి నిజాలను ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో గంజాయి వినియోగంపై స్థానిక శాసనసభ్యులు భూముల కరుణాకర్ రెడ్డి స్వయంగా తిరుపతి నగరంలోని పలు ప్రాంతాలను సందర్శించి అక్కడ గంజాయి వినియోగిస్తున్న వారిని గుర్తించడం జరిగిందని, అయితే ఈ సంఘటనలపై విచారణలు ఏమి చేశారో ప్రజలకు తెలపలేదన్నారు. తిరుపతి జిల్లాలోనే కాకుండా పలు ప్రాంతాల్లో ఇటీవల గంజాయి వినియోగించిన వారు చేసిన అకృత్యాలను సాక్షాత్తు పోలీసులే వెల్లడించారన్నారు. గంజాయి వినియోగం, రవాణా విముక్తికై పోరాడుతున్న తెలుగు యువత, టిడిపి నాయకులపై అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సబబు అన్నారు. ఇకనైనా ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు మధు, జిల్లా అధ్యక్షులు కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

డిఎల్‌డిఒ ఇ.వాణి

ప్రజాశక్తి -బాలాయపల్లి : సచివాలయం సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి అర్హులైన పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అందజేయాలని డిఎల్‌డి ఓ.ఇ.వాణి రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని జయంపు, గొట్టికాడు గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించడంతో పాటు, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని చెప్పారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో వుండి, మెరుగైన సేవలు అందించాలన్నారు. సచివాలయానికి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి అందిన అర్జీలు నిర్ణీత గడువులోగా పరిష్కరించి బియాండ్ ఎస్.ఎల్.ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. తుఫాను తీవ్రత ప్రభావం ఎక్కువగా ఉంటుందని అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డీ.జే వినీల్ కుమార్, ఈవోపీఆర్డి డి మోహన్ రాజు, పంచాయతీ సెక్రెటరీ లీలావతి, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

గృహ ప్రవేశ వేడుకలో సర్పంచ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రణధీరపురం గ్రామ పంచాయతీ వైసీపీ నాయకులు తుంటి సుదాయాదవ్ నూతన గృహ ప్రవేశం సందర్భంగా గురువారం తిరుచానూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ కీరకట్టు రామచంద్రారెడ్డి, బ్రహ్మణపట్టు ఎంపిటిసి బి.యోగానందరెడ్డి, నాయకులు వాసు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు పరిధిలోని వేములపాళెం దళితకాలనీలోని వయోవృద్ధులకు ఇన్నర్ వీల్ క్లబ్, ఆంధ్ర మహిళామండలి వారి దాతృత్వంతో స్థానిక బ్యూరోఆఫ్ సోషల్ సర్వీస్ స్వచ్ఛంధ సేవాసంస్థ ఆధ్వర్యంలో 80 మంది వయోవృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్ర మహిళామండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ చలికాలంలో వృద్దులు రోగాలబారిన పడకుండా ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్, ఆంధ్ర మహిళామండలి, బాస్ సంస్థ బాధ్యులు ఇంద్రసేనమ్మ, విష్ణువందన దేవకుమార్, మనోహర్ హెలన్, ప్రవళిక పాల్గొన్నారు.

తహశీల్దారుగా ఐ.సుబ్రహ్మణ్యం



ప్రజాశక్తి -తొట్టంబేడు: తొట్టంబేడు మండల తహశీల్దార్‌గా ఐ.సుబ్రహ్మణ్యం గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో శ్రీకాళహస్తి తహశీల్దార్‌గా పనిచేసి, అనంతరం బుచ్చినాయుడు కండ్రిగ మండల తహశీల్దార్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సుధీర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-బిఎన్‌కండ్రిగ: మండలంలోని పిల్లేటివారికండ్రిగ పంచాయతీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ సర్పంచ్ యనమల కోటమ్మ ఆధ్వర్యంలో రూ.5 లక్షల ఖర్చుతో పంచాయితీలో 42 మీటర్ల సీసీ రోడ్డును వేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఆ గ్రామంలో రోడ్లు లేక వర్షం పడితే బురదకావడంతో గ్రామస్తులు ఇండ్లలో నుండి బయటకు పోవాలంటేనే కష్టంగా ఉండేది. అలాంటి గ్రామానికి సర్పంచి కుమారుడైన ప్రసాద్ పాల్ అధ్యక్షతన ఈ రోడ్డు నిర్మాణం నిర్మించారు. ఈ రోడ్డు కార్యక్రమం విఆర్‌ఏ ఈ.నాగరాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సీసీ రోడ్డు నిర్మాణం ఆ గ్రామస్తులకు ఎంతో సంతోషంగా ఉందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -గూడూరు, గూడూరు రూరల్ గూడూరు టౌన్ అండ్ రూరల్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గూడూరు పట్టణ పరిధిలోని నెల్‌క్యాస్ట్ సమీపంలో ప్రభువైన ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాజమండ్రి నుండి విచ్చేసిన పర్వతనేని నితిన్ ఏసుక్రీస్తు పుట్టుక గురించి అద్భుతమైన సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గూడూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్, మాజీ కౌన్సిలర్ తాతపూడి ఇశ్రాయేల్ కుమార్, నెల్లూరు నుండి విచ్చేసిన ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ నాయకులు ఊరందూరు సురేంద్రబాబు, బర్నబాస్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.NO. 89 OF 2022

Andhra Pragathi Grameena Bank, Gudur Branch, (Rep. by its Branch Manager) ... వాది

Vs

1. Pokuru Rajanikanth & another ... ప్రతివాదులు

To

Pokuru Rajanikanth S/o. Subramanyam R/o. D.No. 5/153, East Street, Gudur Town & Mandal, Tirupati Dt.

దావా నోటీసు

పై నెంబరు దావాలో పరిహారం లోను రికవరీ నిమిత్తం వాది మీ మీద దావా దాఖలు చేసి వున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తము తే.04-01-2023 దికి వాయిదా వేసి వున్నారు. కావున వాయిదా రోజు ఉదయము 10.30 గంటలకు మీరు స్వతహాగా గానీ, సంపూర్ణముగా సంజాయిషి పొందిన అన్ని ప్రశ్నలకు ఉత్తరములు చెప్పగూడిన ప్లీడరు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవచ్చును. లేని యెడల పై విషయము మీ పరోక్షములో తీర్మానించబడును.

చిల్లకూరు రఘునాథరెడ్డి
వాది తరఫు న్యాయవాది
సెల్ : 9440273358

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - పెళ్లకూరు: మండలంలోని ఎగువు చావాలి గ్రామం వద్ద ఎన్‌హెచ్ 71 జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున 3 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. తిరుపతి నుండి సిమెంట్ లోడుతో నాయుడుపేట వైపు వెళుతున్న లారీ వెనుక టైరు పంచర్ అవడంతో సైడ్ ఆపుకుని ఇండికేటర్లు వేసుకుని క్లీనర్ టైరు మారుస్తున్న సమయంలో, శ్రీకాళహస్తి వైపు నుండి నాయుడుపేట వైపు వస్తున్న మెటల్ లోడ్డుతో ఉన్న టిప్పర్ ఆగి ఉన్న లారీని వెనుక భాగంలో ఢీకొంది. దీంతో టైరు మారుస్తున్న క్లీనర్ గొల్ల వెంకటేశ్వర్లు(46) తండ్రి వెంకటసుబ్బయ్య మృతి చెందాడు. మృతుడు కావలిలో నివాసముంటూ జీవనోపాధికి క్లీనర్ వృత్తి చేస్తున్నాడు. కుటుంబ పెద్దమృతితో ఆ కుటుంబం వీధులు పాలైందని బాధ్యుల రోదనలు చుట్టుపక్కల వారిని కలవరపరిచాయి.

'లంచం ఇస్తేనే ఆవుకు వైద్యం చేస్తా'

వెటర్నరీ డాక్టర్ తీరు

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: ప్రమాదవశాత్తు గాయపడిన ఆవుకు వైద్యం చేయమని అడిగితే రూ.5000 లంచమిస్తేనే వైద్యం చేస్తానని డిమాండ్ చేసిన ఘటన బోడెవాండ్లపల్లి పశువైద్యశాలలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కూరపర్తివారిపల్లి పంచాయతీ పల్లంవారిపల్లికి చెందిన ఈరిశెట్టి సురేష్ అనే రైతు ఆవులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని ఆవు మూడు రోజుల క్రితం పొలంలో మేస్తుండగా ప్రమాదవశాత్తు బ్రిడ్జి పైనుంచి కింద పడటంతో కాలు పూర్తిగా విరిగిపోయి తీవ్ర రక్తస్రావానికి గురై ప్రాణపాయస్థితిలో ఉందని వైద్యం చేయమని వెటర్నరీ డాక్టర్లకు పలుమార్లు విన్నవించుకున్నా ఏమాత్రం పట్టించుకోలేదు. పైగా రూ.5000 లంచం ఇస్తేనే ఆవుకు వైద్యం చేస్తామని వెటర్నరీ డాక్టర్ అన్నట్లు బాధితుడు సురేష్ గురువారం విలేకరులకు తెలిపారు. డ్వాక్రాలో లోను తీసుకుని ఆవులు కొనుగోలు చేసి వాటిని మేపుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. వెంటనే సంబంధించిన ఉన్నత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులు ఈ-క్రాప్ తప్పనిసరి చేయించాలి

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట సబ్‌డివిజన్ లోని 5 మండలాల వ్యవసాయాధికారులతో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు సహాయ వ్యవసాయ సంచాలకులవారి కార్యాలయం నాయుడుపేటలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రదానంగా రబీ సీజన్లో ఈ క్రాప్ నమోదు గురించి, పంట వేసిన ప్రతి రైతును ఈ క్రాప్ చేయించాలని సూచించారు. దీంతో పాటుగా పీఎం కిసాన్ ఈకెవైసి గురించి, ఆర్‌బికెల ద్వారా సరఫరా చేసిన ఎరువులు పంపిణీ గురించి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయం ఏడీఏ ధనంజయ రెడ్డి, నాయుడుపేట ఏఓ గణేష్, చిట్టమూరు ఏఓ సుచేంద్ర ప్రసాద్, పెళ్లకూరు ఏఓ ప్రవీణ, కోట ఏఓ నిరంజన్ కుమార్, వాకాడు ఏఓ దీప, ఏడీఏ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -పెళ్లకూరు: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పెళ్లకూరు మండలం ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రాజ్యాంగం 11వ షెడ్యూల్లో చేర్చిన 29 అంశాలపై గ్రామ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ స్వరాజ్ కలను నిజం చేయుటకు గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అమలు చేయుట ఇందులో ముఖ్య ఉద్దేశం అన్నారు. గ్రామంలో ప్రధానంగా తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, విద్యుత్ దీపాలు డ్రైనేజ్, ఉపాధి కల్పన, కుటీర పరిశ్రమల ప్రోత్సాహం వృత్తి నైపుణ్య ప్రోత్సాహకాలు మొదలైన 29 అంశాలతో కూడిన ప్రణాళికతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామ స్వరాజ్ వ్యవస్థను పటిష్టం చేసే విధంగా ఈ కార్యక్రమం జరిగింది, ఈ కార్యక్రమంలో ఎలాంటి ప్రణాళిక రూపొందించుకోవాలి, వనరుల సమీకరణ వాటి వినియోగం, రాబోయే 2023 .2024 బడ్జెట్ను గ్రామసభల ఏర్పాటు ద్వారా వేటికి ప్రాధాన్యతనివ్వాలి అనే అంశాలపై చర్చించి, అభివృద్ధి పథంలో నడిచే విధంగా పలువురు అధికారులు తెలియజేశారు. ఎమ్మార్వో జయ జయ రావు, డిఎల్‌పిఒ, ఎండిఓ సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE VIITH ADDL. DISTRICT JUDGE : GUDUR

E.P. NO. 158 OF 2019

O.S.NO. 105 OF 2010

Nelapala Sambasiva Rao ... D.H.R.

Vs

SK Hussain @ SK. Himam Hussain ... J.D.R.

వేలం ప్రకటన

పై నెంబరున డిక్రీ హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు జెడిఆర్ తాలూకు ఈ క్రింది షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని తే. 27.12.2022 దిన ఉదయం 10.30 నుంచి సాయంత్రము 5 గంటల లోపు పై కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాట దారులు ఎవరైనా వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

SCHEDULE

S.P.S.Nellore District Registration - Gudur Sub-Registration - Agricultural lands situated in Guruvindapudi Village and Grama Panchayat area - Manubolu Mandal - lands in comprised in :

Sl No	Survey No	Extent in Enjoyment	Sale Extent
1.	1-2	Ac.1.16 cents	Ac.1.16 cents
2.	2 (Part)	Ac.1.00 cents	Ac.1.00 cents
3.	266	Ac.1.41 cents	Ac.1.41 cents
	Total	Ac.3.57 cents of Wet land	

Boundaries for S.No. 1-2
East : Lands of Gurram Pullaiah (Sy.No. 2 Part)
South : Lands is Survey No. 266
West : Lands of Puthuru Balaramaiah (Sy.No. 1/1)
North : Lands in Surveypalli Village

Boundaries for S.No. 2
East : Road
South : Lands of Medarametla Pitchaiah (Remaining lands in Survey No.2 part)
West : Lands of Nagendra Babu (S.No. 266)
North : Lands of Dasari Subbaiah (Remaining lands in Survey No.2 part)

Boundaries for S.No. 266
East : Lands is Survey No. 2
South : Lands is Survey No. 1/4
West : Lands is Survey No. 1/1 and 1/3
North : Lands is Survey No. 1/2

DHR Value : Rs. 1,00,00,000/-
Amin Value : Rs. 1,40,00,000/-

C. RAGHUNADHA REDDY
Advocate for the D.H.R.
Cell: 9440273358.